వారధి లేక..


మరో మార్గం లేక గోస్తని నదిలో దిగి వెళ్తున్న మహిళలు

నాలుగు రోజులుగా ఆ గ్రామానికి మార్గం మూసుకుపోయింది. గోస్తని నదిని ఆనుకుని ఉండటంతో వర్షాలు వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి. కాజ్‌వే మీదుగా నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామస్తులు ఊరుదాటి వెళ్లడం, ఇతర గ్రామస్తులు ఆ ఊరు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. నాయకులు ఇచ్చిన వాగ్దానాలు నీటి మీద రాతలానే మిగిలిపోవడం.. ఎట్టకేలకు పనులు ప్రారంభమైనా ముందుకు సాగకపోవడంతో మన్యం వీరుడు అల్లూరి జన్మించిన గడ్డపై ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.


నదిలో దిగి కాజ్‌వేపై డ్రైవింగ్ చేసుకుంటూ వెళుతున్న ద్విచక్ర వాహన చోదకులు

- వర్షం వస్తే మూసుకుపోతున్న మార్గం
- నీటి ఉధృతిలో తప్పని ప్రయాణం
- మన్యం వీరుడి గడ్డపై ప్రజల అవస్థలు

పద్మనాభం: పాండ్రంగి కాజ్‌వేపై వంతెన నిర్మాణం దశాబ్దాలుగా నెరవేరకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామస్తులు తగరపువలస, విశాఖ, విజయనగరం వెళ్లాలంటే లో లెవెల్ కాజ్‌వే మీదుగా నది దాటి జంక్షన్‌కు చేరుకుని వెళ్లాలి. ఇక మండలంలోని అనంతవరం, పెంట, పాత కొవ్వాడ, కొత్తకొవ్వాడ, గంధవరం గ్రామస్తులు పాండ్రంగి గ్రామం మీదుగా నదిలో నుంచి తగరపువలస, భీమునిపట్నం వెళతారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారు నదిలో దిగి పాండ్రంగి, ఆనందపురం మండలం బోని వెళతారు. కొద్దిపాటి వర్షాలకే నదిలో ఉన్న లోలెవెల్ కాజ్‌వే మీదుగా నీరు ఉధృతంగా ప్రవహించడంతో వారంతా ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే వేలమందికి ఎంతో ఊరట లభిస్తుంది.

నాలుగు రోజులుగా ఇదీ పరిస్థితి..

నాలుగు రోజుల నుంచి నదిలో నుంచి కాజ్‌వే మీద నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు ఊరు విడిచి పైకి వెళ్లాలంటే కష్టమవుతోంది. సంగివలస మీదుగా తగరపువలస, బోని మీదుగా పద్మనాభం రావాలనుకున్నా దూరాభారం కావడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. భారీ వర్షాల సమయంలో ఈ మార్గాలు మూసుకుపోతాయి. సంగివలస వద్ద మధ్యలో గెడ్డ, మద్ది సమీపాన ఉన్న పల్లిగెడ్డ మీద నుంచి నీరు ప్రవహిస్తోంది. ఇటువంటి సందర్భాల్లో పాండ్రంగి వాసులు ఊరు విడిచి ఎటూ వెళ్లలేని పరిస్థితి. పాండ్రంగి పంచాయతీ శివారు గ్రామాలైన కురపల్లి, బర్లపేట గ్రామాల ప్రజలు వర్షాల్లో పంచాయతీ పరమైన పనులకు పాండ్రంగి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది తప్పని పరిస్థితుల్లో నదిలో దిగి ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగిస్తుంటారు. ఇతర గ్రామాల నుంచి పాండ్రంగి వచ్చే వారికి వారికి నదిలో కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహిస్తుందన్న విషయం తెలియక నది వరకు వచ్చి వెనుదిరిగి వెళ్లిపోవల్సిన పరిస్థితి.

వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరైనా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.16.50 కోట్ల పంచాయతీ రాజ్ నిధులు మంజూరు చేశారు. వంతెన నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా వంతెన నిర్మాణ పనులు పట్టించుకోలేదు. ఈ ఏడాది మే నెలలో పనుల్లో కదలిక వచ్చినా.. ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. పిల్లర్స్ వేయడానికి గోతులు తవ్వి కాంక్రీట్ వేశారు. ఈ వంతెన ఎప్పుడు పూర్తవుతుందా అని ప్రజలు నిరీక్షిస్తున్నారు.


నదిలో కాజ్‌వే పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు


నదిలో ద్విచక్ర వాహనాన్ని నడిపించుకుంటూ వెళ్తున్న యువకులు

నీటి మీద రాతల్లా వాగ్దానాలు

ఈ గ్రామానికి చెందిన ఆర్.ఎస్.సూర్యరాయణరాజు ఒక విడత, ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు నాలుగు విడతలు భీమిలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పలనరసింహరాజు కొంతకాలం మంత్రిగా పని చేశారు. అయినా వంతెన నిర్మాణం జరగలేదు. తరవాత ఎమ్మెల్యేగా ఎన్నికైన కర్రి సీతారాం, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖపట్నం ఎంపీగా పనిచేసిన దగ్గుబాటి పురందేశ్వరి వంతెన నిర్మిస్తామని హామీలు గుప్పించారు. గంటా శ్రీనివాసరావు వంతెన నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అప్పట్లో ఆయన మంత్రి కూడా అయ్యారు. అయినా వంతెన నిర్మించలేదు. సురేష్ ప్రభు రైల్వే శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అయినా వంతెన నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

నదిలో దిగి వెళ్లలేక వెనుదిరిగాం



పాండ్రంగిలో మా బంధువుల ఇంట్లో శుభకార్యం కోసం వచ్చాం. కైలాసగిరి నుంచి కుటుంబసభ్యులందరం వచ్చాం. తీరా గోస్తని నది వద్దకు వచ్చేటప్పటికీ కాజ్‌వేపై నీటి ఉధృతి ఎక్కువగా ఉంది. నదిలో దిగి సాహసం చేయలేక వెనక్కి వెళ్లిపోతున్నాం. మా చిన్నప్పటి నుంచి ఇవే పరిస్థితులు ఎదుర్కొంటున్నాం.

– కె.ధనలక్ష్మి, కైలాసగిరి, విశాఖపట్నం

నదిలో దిగి చాలా కష్టంగా వెళ్లాను



మాది భీమిలి మండలం దాకమర్రి. ఆనందపురం మండలం బోనిలో మా బంధువు మృతి చెందారని తెలిసి, ద్విచక్ర వాహనంపై వచ్చాను. నదిలో కాజ్‌వే పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో బైక్ నది ఒడ్డున విడిచిపెట్టి, నదిలో దిగి బోని వెళ్లి వచ్చాను. నదిలో నీరు ఈడ్చేస్తోంది. చాలా కష్టంగా వెళ్లాను. వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.

– కె.రాజు, దాకమర్రి, భీమిలి మండలం

ఆటో నిలిపేశాను



నేను ట్రావెల్ ఆటో నడుపుతాను. తగరపువలస–పాండ్రంగి మధ్య సర్వీస్ చేస్తుంటాను. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురవడంతో నదిలో కాజ్‌వే పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో నుంచి నడపడం ప్రమాదకరం కావడంతో ఆటో పాండ్రంగి వెళ్లకుండా నిలిపివేశాను.

– జి.శ్రీను, ఆటోడ్రైవర్, రౌతుపాలెం, పద్మనాభం మండలం

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు


శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న భక్తులు శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

50 మందికి కంటి వైద్య పరీక్షలు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెంలో శనివారం శంకర్ ఫౌండేషన్, ఓఎస్‌జీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరిని శస్త్రచికిత్సల కోసం సోమవారం తరలించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు గౌతమి, క్యాంప్ కో–ఆర్డినేటర్ రాజు, బావిశెట్టి రాజు, ఓఎస్‌జీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దళాయి శివ తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు


వలందపేట జాతీయరహదారిపై ప్రమాదానికి గురైన లారీలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు వలందపేట జాతీయరహదారిపై శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వలందపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని పశ్చిమ బెంగాల్‌కు చెందిన మరొక లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయి, డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రోడ్డు భద్రత పోలీసులు సకాలంలో స్పందించి, డ్రైవర్‌ను బయటికి తీసి చికిత్సకు తరలించారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత విశాఖ జట్టు


విజేత విశాఖ జట్టుకు కప్పు అందిస్తున్న కోటగిరి శ్రీధర్

భీమునిపట్నం: భీమిలిలో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నిగ్ధశ్రీ జయంతి సందర్భంగా జరిగిన ఫుట్‌బాల్ ఆహ్వాన పోటీల్లో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పలు జట్లు పాల్గొనగా విశాఖ, చిట్టివలస జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. విజేతగా నిలిచిన విశాఖ జట్టుకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ట్రోఫీని, రూ.50వేలు నగదు బహుమతిని అందించారు. రన్నర్‌గా నిలిచిన చిట్టివలస జట్టుకు రూ. 25వేలను అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, సభ్యులు కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు చినబాబు, మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు రాట


ఉత్సవరాట వేస్తున్న రాముునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ రోడ్డులో గణపతి ఉత్సవాలకు శనివారం పందిరి రాట వేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాముునాయుడు, పరిమి భువనేశ్వరి, గుజ్జు వెంకట పైడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్తియాత్రలో బాలవికాస్ విద్యార్థులు


ప్రదర్శనలో ఆకట్టుకున్న చిన్నారి యశస్విని

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 17 వరకు పుట్టపర్తిలో జరుగుతున్న జాతీయ యువజనోత్సవాల్లో చిట్టివలస బాలవికాస్‌కు చెందిన విద్యార్థిని కుంచం యశస్విని విశేష ప్రతిభ కనబరిచింది. పార్వతీదేవి పాత్రలో అద్భుతంగా అభినయించి, బాబా భక్తుల ప్రశంసలు అందుకుంది. పర్తియాత్రలో చిట్టివలస సత్యసాయి సేవాసమితి నుంచి కన్వీనర్ గొట్టిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో 75మంది పాల్గొన్నారు. ప్రశాంతినిలయం సాయి కుళ్వంత్ హాల్లో ఈ ప్రదర్శన జరిగింది.

చిత్తడిగా రహదారులు


పీఎం పాలెం ఆఖరి బస్టాప్ నుంచి శంభువానిపాలెం వెళ్లే రోడ్డులో గుంతల్లో చేరిన వాననీరు

పీఎం పాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ ఆరోవార్డులోని రహదారులు చిత్తడిగా మారాయి. రహదారులు కనీస నిర్వహణ లేక గతుకులమయంగా మారాయి. ఆ గోతుల్లో వాన నీరు చేరడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, హెచ్‌పీసీఎల్ కాలనీ తదితర ప్రాంతాలలో నిర్మించిన కల్వర్టులను రోడ్లకు సక్రమంగా అనుసంధానం చేయకపోవడంతో గతుకులు ఏర్పడ్డాయి. ఆ గతుకుల్లో వర్షం నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో ఆ రోడ్లలో ప్రయాణం చేసేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శిల్పారామం.. హరితశోభితం


కుండీల్లో వేసిన మొక్కలతో ఆకర్షణీయంగా..

పీఎం పాలెం: శిల్పారామాన్ని సరికొత్త అందాలతో తీర్చిదిద్దుతున్నామని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి అన్నారు. శిల్పారామంలో పెద్దవి 100 కుండీలను ఏర్పాటు చేసి, వాటిలో 5 రకాల గార్డెన్ మొక్కలు నాటామని తెలిపారు. అలాగే స్థానిక వృత్తాకారంలో ఉన్న పచ్చిక లాన్‌కు బోర్డర్‌కు వెదురు వంటి గార్డెన్ మొక్కలు నాటుతున్నామని చెప్పారు. సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా సాయంత్రం వేళల్లో శ్రావ్యమైన సంగీతం యూనిట్‌ను కూడా పునరుద్ధరించామన్నారు.

అలరించిన ‘బాల గోకులం’


గోపికా కృష్ణుల వేషధారణలో చిన్నారుల నృత్య ప్రదర్శన


గోపికా కృష్ణుల వేషధారణల్లో చిన్నారులతో నిర్వాహకులు


అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

బాలగోకులం అలరించింది. ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ సంయుక్తంగా సంతపేట రామాయలంలో నిర్వహించిన బాలగోకులంలో 9ఏళ్ల లోపు బాలబాలికలు సుమారు 80మంది పాల్గొన్నారు. మూడువర్గాల్లో శ్రీకృష్ణ వేషధారణ, పద్యం, వచనం వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పద్మనాభంలోని అనంతుని కల్యాణమండపంలో నిర్వహించిన బాలగోకులం పోటీల్లో చిన్నారులకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు బహుమతులు అందజేశారు. కీతినేపేట సన్ స్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– తగరపువలస/పద్మనాభం/భీమునిపట్నం

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..

- నందనందనుడికి ప్రత్యేక పూజలు
- వేడుకగా కృష్ణాష్టమి

కృష్ణాష్టమి పర్వదినాన్ని కనులపండువగా నిర్వహించారు. యశోదాదేవి ముద్దుల తనయుడు, నందనందనుడిని చూడచక్కగా అలంకరించి.. విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. సప్త నదీజలాలతో కృష్ణుడిని అభిషేకించి, పుష్పాలతో అర్చించారు. ఉట్టి ఉత్సవాలు, నృత్యప్రదర్శనలు అలరించాయి.


లక్ష్మీపురంలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


గుడివాడలో కృష్ణుడి సన్నిధిలో భక్తులు


ప్రత్యేక అలంకరణలో శ్రీరాధా మదన్ మోహనులు

తగరపువలస: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో శనివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బాలగోపాలునికి, శ్రీరాధా మదన్ మోహనులకు విశేషపూజలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, అంబరీష దాస సప్తనదీ జలాల నుంచి సేకరించిన 108 పవిత్ర జల కలశాలు, పండ్ల రసాలు, పంచగవ్యాలు, వివిధ రకాల పుష్పాలతో వైభవంగా మహా అభిషేకం నిర్వహించారు. భక్తులు బాలగోపాలుని స్వయంగా పాలతో అభిషేకించారు. భక్తులకు శ్రీకృష్ణ బలరాముల దర్శనాలు కల్పించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఊయల సేవలో భక్తులు తరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రఖ్యాత కళాకారులు కె.విద్యశ్రీ, తాడి శ్రీసంతోషి, మండపాక శారద, కుసుమ, కర్రి యామినీ కృష్ణ, విజయనగరం బీవీకే, గాయత్రీ విద్యాపరిషత్ విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హరినామ జపంలో 2వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఉట్టి ఉత్సవం, కృష్ణునితో సెల్ఫీ, వేర్వేరు కృష్ణుని చిత్రాలు గుర్తించడం, కృష్ణుడు ఎవరు తదితర పోటీలు నిర్వహించి, భక్తులకు బహుమతులు అందించారు. రాత్రి 12 గంటలకు మహా మంగళహారతి నిర్వహించారు.

నేడు నందోత్సవం

ఆదివారం భక్తి వేదాంత స్వామి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 9 వరకు 1000 రకాల వంటకాలతో నైవేద్యం నివేదిస్తామని నిర్వాహకులు తెలిపారు. నంద మహరాజుకు పుత్రుడు జన్మించిన సందర్భంగా నందోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇస్కాన్‌లో ..

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున మంగళహారతితో పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు సామూహిక హరినామ జపం చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని శ్రీకృష్ణ లీలలపై ప్రవచించారు. బృందావనం నుంచి తెప్పించిన పట్టు వస్త్రాలు, వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన పుష్పాలతో రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మందిర ప్రాంగణంలో ఉట్టి ఉత్సవం, రాధాకృష్ణుల వేషధారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి వివిధ పుణ్య నదుల నుండి సేకరించిన పవిత్ర జలాలు, పండ్ల రసాలు, పంచామృతం, పుష్పములతో అభిషేకించారు. రాధాకృష్ణులను సీపీ శంఖబ్రత బాగ్చి, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక వేత్తలు వంశీ ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంతం ఆధ్వర్యంలో..

తగరపువలస: భీమిలి మండలం దివీస్ రోడ్డులోని గుడివాడ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధానందుని శిష్యులు ఇందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణుని జన్మ విశిష్టత గురించి ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు మొక్క వెంకటరమణ, బోని రావణ అక్షయ్ వివరించారు. భీమిలి, భోగాపురం మండలాల నుంచి విశేషంగా భక్తులు పాల్గొని, అన్నప్రసాదాలు స్వీకరించారు. కర్రోతు సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


ఇస్కాన్‌లో అలరించిన నృత్య ప్రదర్శన


మద్దిలో శ్రీ కృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు

శ్రీకృష్ణభగవానుడి తిరువీధి ఉత్సవం

మజ్జివలస ఆనందాశ్రమం ఆధ్వర్యంలో శనివారం మజ్జివలస, లక్ష్మీపురం పంచాయితీలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితిచే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగించారు.


వెంకటాపురంలో శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద భక్తుల పూజలు

మద్దిలో..

పద్మనాభం: మద్దిలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని నిలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, భీమిలి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గాడు శ్రీను కృష్ణుడిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో బి.ఎర్నాయుడు, విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథ, సభ్యులు పాల్గొన్నారు.

- వెంకటాపురంలో శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి సంబరం ఆకట్టుకుంది. రేవిడి ఎంపీటీసీ సీర సూరప్పడు, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వేడుకలు

పీఎం పాలెం: శ్రీ కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. తమ పిల్లలను రాధాకృష్ణులుగా అలంకరించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పూజలు చేశారు.


ప్రత్యేక పూజలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి